ఉత్సాహంగా 'రన్ ఫర్ ద సన్'


సైక్లాథాన్‌లో పాల్గొన్న మర్రి లక్ష్మారెడ్డి

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సన్ ఫ్లవర్ వేదిక్ స్కూల్ ఆధ్వర్యంలో ఆదివారం 'రన్ ఫర్ ద సన్' సీజన్–2 కార్యక్రమం నిర్వహించారు. ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తూ చేపట్టిన కార్యక్రమాన్ని ఎంఎల్‌ఆర్ విద్యాసంస్థల చైర్మన్ మర్రి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పాఠశాల డైరెక్టర్ సరితకుమార్, ప్రిన్సిపాల్ కల్పనతో కలిసి ప్రారంభించారు. వాక్‌థాన్ 5 కె, సైక్లాథాన్ 10 కె, శారీథాన్ 5 కె, 5 కె రన్ పోటీలు నిర్వహించగా.. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సైక్లాథాన్‌లో..
ఈ పోటీల్లో మర్రి లక్ష్మారెడ్డి ఉత్సాహంగా పాల్గొన్న చిన్నారులతో పోటీపడి మొదటి స్థానంలో నిలిచి అందరిని ఆనందపరిచారు. శారీథాన్‌లో హైదరాబాద్ రన్నర్స్ గ్రూప్‌నకు చెందిన తాడికొండ సుధా, మహిళలు పాల్గొన్నారు. అనంతరం విజేతలకు డైరెక్టర్ సరిత కుమార్ బహుమతులు ప్రదానం చేశారు. స్కూల్ డైరెక్టర్ మాట్లాడుతూ.. శారీరక దృఢత్వం, ఆరోగ్యం కోసం క్రీడలు ఎంతో అవసరమన్నారు. విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని నింపేందుకు వారిని అన్ని రంగాల్లో ఉత్సాహపరిచేలా కార్యక్రమం నిర్వహించామన్నారు.


5 కె రన్‌లో విద్యార్థులు, తల్లిదండ్రులు

శివ కేశవ నమోస్తుతే !

భక్తులతో కిటకిటలాడిన కీసరగుట్ట, చీర్యాల క్షేత్రాలు • సామూహిక సత్యనారాయణ వ్రతాలు, అభిషేకాలు


స్వామి దర్శనం కోసం క్యూలైన్లలో భక్తులు


చీర్యాల దేవాలయం వద్ద సామూహిక వ్రతాలు



కీసర: కార్తీకమాసోత్సవ ప్రత్యేకపూజ కార్యక్రమాల్లో భాగంగా ప్రఖ్యాత శైవ క్షేత్రమైన కీసరగుట్ట శ్రీ భవానీరామలింగేశ్వరస్వామి దేవస్థానంలో 3వ ఆదివారం స్వామివారికి నానావిధ పత్రి పూజను పండితులు కనుల పండువగా నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజామున గర్భాలయంలో కొలువైన స్వామివారికి (శివ లింగానికి) ఉదయం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, అనంతరం నానావిధ పత్రిపూజను కనుల పండువగా నిర్వహించారు.

సెలవురోజు కావడంతో..

ఆదివారం సెలవు దినం కావడం చేత స్వామి దర్శనంకోసం వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. స్వామి దర్శనానంతరం దేవాలయ పరిసరాల్లో ఉన్న శివలింగాల వద్ద కార్తీకదీపాలు వెలిగించారు. అనంతరం హుడాపార్కు తదితర ప్రాంతాల్లో యాత్రికులు కార్తీక వనభోజనాలు చేశారు. ఆలయ చైర్మన్ తటాకం నాగలింగం, ఈఓ సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

చీర్యాల దేవాలయంలో..

చీర్యాల శ్రీ లక్ష్మీనృసింహస్వామి దేవాలయంలో నిర్వహించిన సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. దేవాలయం తరపున భక్తులకు పూజా సామగ్రిని సమకూర్చామని, ఆలయ చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ, ధర్మకర్త శ్రీహరిగౌడ్‌లు తెలిపారు.

వారాంతపు సంత

మేడ్చల్: మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలో ప్రతీవారం కూరగాయాలు, ఇతర సామగ్రి విక్రయించే వారాంతపు సంతల వివరాలు ప్రాంతాల వారీగా ఉన్నాయి.
సోమవారం – రైల్వేస్టేషన్ రోడ్డు (పోలీస్ క్వార్టర్స్ రోడ్డు), అత్వెల్లి, మంగళవారం–ఉమానగర్, కేఎల్‌ఆర్ విజయానగర్
బుధవారం– ఎన్‌జీఓస్ కాలనీ (మేడ్చల్), గురువారం–వీకర్ సెక్షన్ కాలనీ (జెడ్పీహెచ్‌ఎస్ స్కూల్ వద్ద),
శుక్రవారం–సూర్యనగర్, చంద్రానగర్,
శనివారం–హౌజింగ్‌బోర్డ్ కాలనీ, కిష్టాపూర్, చెక్‌పోస్టు, ఆర్టీసీ కాలనీ
ఆదివారం– ప్రధాన మార్కెట్‌లో సంతలు కొనసాగుతాయి.

రూ.18 లక్షలతో అభివృద్ధి పనులు


పనులను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి

కీసర: నాగారం మున్సిపాలిటీని అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. ఆదివారం మున్సిపల్ పరిధిలోని 5వ వార్డులోని ప్రభాకర్ ఎన్‌క్లేవ్, శ్రీనివాస్‌నగర్ కాలనీలో సుమారు రూ.18 లక్షల మున్సిపల్ సాధారణ నిధులతో చేపట్టనున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, సీసీరోడ్డు పనులను ఆయన మున్సిపల్ వైస్ చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్ పరిధిలోని వివిధ వార్డులో ప్రజలకు మెరుగైన వసతులు కల్పించేందుకు కృషిచేస్తామన్నారు. కౌన్సిలర్ అన్నంరాజు లావణ్యశ్రీనివాస్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ హిందువు భగవద్గీత పఠనం చేయాలి


పూడూర్‌లో ప్రచార రథం వద్ద ఇందూ జ్ఞాన వేదిక సభ్యులు

మేడ్చల్‌రూరల్: మున్సిపాలిటీ పరిధి పూడూర్ గ్రామంలో త్రైత సిద్ధాంత– ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక హైదరాబాద్ కమిటీ సభ్యులు భగవద్గీత, అనుబంధ గ్రంథాలను ప్రచారం చేశారు. గ్రామంలోని పలు కాలనీల్లో తిరిగి కార్తీకమాసం, కార్తీక దీపం విశిష్టత ప్రజలకు వివరించారు. ప్రతీ హిందువు భగవద్గీత పఠనం చేసి అందులోకి అంతరార్థం తెలుసుకోవాలన్నారు. కమిటీ అధ్యక్షులు గిరి, సభ్యులు కుమార్, నర్సింహ్మాచారి, మధు, మహేష్, భాస్కర్, లక్ష్మి, శోభ, జ్యోష్న్స, అజయ్, హారిక, ఎల్లమ్మ, నాగమణి, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

సందడిగా కార్తీక వనభోజనాలు


మాట్లాడుతున్న జాతీయ మానవహక్కుల కమిషన్ చైర్‌పర్సన్ విజయ భారతి

కీసర: కార్తీకమాసం సందర్భంగా కీసర ఓఆర్‌ఆర్ సమీపంలో కాపు రజితోత్సవ వనభోజన కార్యక్రమానికి జాతీయ మానవ హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ విజయభారతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ.. నగరంలోని ఈసీఐఎల్, కాప్రా ప్రాంతానికి చెందిన కాపు కులాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ప్రతిఏటా కార్తీక మాసం సందర్భంగా కీసరగుట్ట పరిసర ప్రాంతాల్లో కార్తీకవన భోజనాలు ఏర్పాటు చేసుకోవడం సంతోషించదగ్గ విషయమన్నారు. ఆంధ్రప్రదేశ్ సర్వోదయ మండల్ అధ్యక్షులు నీలం రాంబాబు నాయుడు, సుబ్బారావు, రామారావు, రాధిక, రాఘవేంద్రరావు, కాపు కులాల ఐక్యవేదిక అధ్యక్షులు జీవీఎస్‌రావు , ప్రధాన కార్యదర్శి నాగు, శ్రీనివాస్‌రావు, దేవరకొండ, శంకర్‌బాబు, పులిసత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల వినూత్న నిరసన

జవహర్‌నగర్: రాష్ట్రంలో ఆటోడ్రైవర్ల దుస్థితి ఘోరంగా ఉందని, 56 మంది ఆటోడ్రైవర్లు ఆత్మహత్య చేసుకున్నా.. ప్రభుత్వానికి కనువిప్పు కలగటం లేదని తెలంగాణ రాష్ట్ర బీఎంఎస్, బీపీటీఎంఎం జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మహ్మద్ హబీద్ ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్ర బీఎంఎస్, బీపీటీఎంఎం జేఏసీ ఆధ్వర్యంలో జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో ఆదివారం ఆటో డ్రైవర్లతో కలిసి వినూత్నంగా బిక్షాటన చేశారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్న మహిళలను భిక్షాటన అడిగారు. వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో మహాలక్ష్మి పథకం తీసుకొచ్చి ఆటో డ్రైవర్ల నోట్లో మట్టి కొట్టారన్నారు. ఆటో డ్రైవర్లు పిల్లలకు స్కూల్ ఫీజులు కట్టలేక, పాలు కొనలేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. మేనిఫెస్టోలో పెట్టిన విధంగా ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు, రూ.12 వేలు ఇవ్వాలని, లేదంటే పెద్దఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. నాయకులు శంకర్, రవి, బాలాజీనగర్ ఆటో సంఘం డ్రైవర్లు పాల్గొన్నారు.


బస్సులో మహిళలను భిక్షాటన అడుగుతున్న డ్రైవర్లు

రైల్వేస్టేషన్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి


రైల్వే అధికారులతో కార్పొరేటర్ శ్రవణ్

మల్కాజిగిరి: మల్కాజిగిరిలోని ఆనంద్‌బాగ్, సర్దార్ పటేల్‌నగర్ ప్రాంతాల్లో రైల్వేస్టేషన్ల నిర్మాణానికి అధికారులు చర్యలు తీసుకోవాలని మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ కోరారు. ఆదివారం ఆనంద్‌బాగ్, ఎస్పీనగర్ ప్రాంతాలను రైల్వే అధికారులతో కలిసి పరిశీలించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. చర్లపల్లి టర్మినల్ త్వరలోనే ప్రారంభం కానున్నడంతో అక్కడి నుంచి ప్రయాణికులు ఇతర ప్రాంతాలకు చేరుకోవాలంటే ఎంఎంటీఎస్ ట్రెన్స్ నడపడం వల్ల వారికి ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అధికారులు నివేదిక తయారుచేసి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తున్నామని చెప్పారని, త్వరలోనే సికింద్రాబాద్, హైదరాబాద్ డివిజన్ల పరిధిలోని జీఎంలను కలిసి సమస్యను వివరిస్తామన్నారు. ఎస్పీనగర్‌లో తగినంత స్థలం ఉండటంతో స్టేషన్ నిర్మాణానికి ఎలాంటి ఇబ్బందులు లేవన్నారు. ఆనంద్‌బాగ్ ఆర్‌యూబీకి సమీపంలో హాల్టింగ్ స్టేషన్‌కు అనువుగా లేకపోతే దయానంద్‌నగర్ స్టేషన్ సమీపంలో అనువైన స్థలం ఉందని అక్కడ నిర్మించాలన్నారు. ఏడీఈ ఎస్ శ్రీధర్, రామక్రిష్ణ, వెంకట్‌రెడ్డి, సుబ్బారావు, రవి, సాయి, చిన్నా పాల్గొన్నారు.

ప్రశాంతంగా గ్రూపు- 3 పరీక్షలు


ఏసీఈ కళాశాల వద్ద తనిఖీలు చేస్తున్న పోలీసులు


మెగా కళాశాల వద్ద క్యూలైన్

మేడ్చల్: గ్రూపు–3 పోస్టుల భర్తీ కోసం ప్రభుత్వం ఆదివారం నిర్వహించిన పరీక్షలు మేడ్చల్‌లో ప్రశాంతంగా జరిగాయి. పట్టణంలోని స్ఫూర్తి జూనియర్ కళాశాల, ఎస్‌ఎస్‌ఆర్, అయతి, అక్షర, గాయత్రి, జాగృతి కళాశాలలో జ్ఞానాపూర్ హితం కళాశాలలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహించారు. మేడ్చల్, పేట్ బషీరాబాద్‌లలో 21 సెంటర్లలో 12,567 మంది పరీక్షలు రాయడానికి ఏర్పాట్లు చేయగా.. కేవలం 2951 మంది అభ్యర్థులు మాత్రమే హాజరై పరీక్షలు రాశారు.

ఒక ప్రశ్నపత్రానికి బదులు మరోటి...

పట్టణంలోని ఎస్‌ఎస్‌ఆర్ జూనియర్ కళాశాల కేంద్రం మొదటి సెషన్‌లో తెలుగు, ఇంగ్లిష్ ప్రశ్నపత్రానికి బదులు ఉర్దూ, ఇంగ్లిష్ పత్రం రావడంతో కాసేపు అభ్యర్థుల్లో గందరగోళం ఏర్పడింది. అభ్యర్థులు విషయాన్ని నిర్వహణ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే పత్రాలు మార్చి అభ్యర్థులకు అందజేశారు. ఈ గందరగోళంతో 5 నిమిషాలు వృథా కావడంతో అభ్యర్థులకు చివర్లో 6 నిమిషాలు అదనపు సమయం ఇచ్చి పరీక్షను పూర్తి చేయించారు.

ఘట్‌కేసర్‌లో..

◆ 10 కేంద్రాల్లో 2775 మంది గైర్హాజరు

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ మున్సిపాలిటీలో 10 కేంద్రాలు ఏర్పాటు చేసి 6,411 మంది అభ్యర్థులను కేటాయించారు. 3,636 మంది అభ్యర్థులు పరీక్షలు రాయగా.. 2,775 మంది గైర్హాజరయ్యారు. ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్ పరుశురాం ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేయగా.. మల్కాజ్‌గిరి ఏసీపీ చక్రపాణి పరీక్ష కేంద్రాలను సందర్శించారు. సంస్కృతి, మెగా, వీబీఐటీ, ఏసీఈ, అరోరా, కేపీఆర్ ఐటీ, విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు.


పరీక్ష కేంద్రం వద్ద పోలీసుల బందోబస్తు

నేటి ప్రజావాణి రద్దు

మేడ్చల్ కలెక్టర్ గౌతమ్

సాక్షి,సిటీబ్యూరో: గ్రూపు–3 పరీక్షల నేపథ్యంలో సోమవారం జరగాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ తెలిపారు. జిల్లా అధికారులు గ్రూపు–3 పరీక్షల నిర్వహణలో విధులు నిర్వహిస్తున్నందున ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు ప్రకటించారు.

టీఎన్‌జీవోస్ హాస్టల్ ఫోరం అధ్యక్షుడి నియామకం

సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా టీఎన్‌జీవోస్ హాస్టల్ వెల్ఫేర్ ఫోరం అధ్యక్షుడిగా ఎం.మాణిక్యం, కార్యదర్శిగా కె.కమల్ దాసు ఎన్నికయ్యారు. ఫోరం ఎన్నికలు కలెక్టరేట్‌లోని మినీ సమావేశంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు రవిప్రకాష్ హాజరయ్యారు. ఈ కొత్త కమిటీ మూడేళ్ల వరకు కొనసాగుతుందని ఎన్నికల అధికారి శ్రీనివాస్ వివరించారు. నూతన ఫోరం కమిటీలో కోశాధికారిగా తిరుపతయ్య, ఉపాధ్యక్షుడిగా నరసింహ, జాయింట్ సెక్రటరీగా జ్యోతి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా రాఘవేంద్ర, ప్రచార కార్యదర్శిగా శ్రవణ్, ఈసీ సభ్యులుగా శ్రీనివాస్, వెంకటలక్ష్మిలు ఎన్నికయ్యారు.

శానిటేషన్‌పై స్పెషల్ డ్రైవ్


శానిటేషన్ పనులను పరిశీలించిన చైర్మన్ కొండల్‌రెడ్డి

పోచారం: మున్సిపాలిటీ పరిధిలో చేపట్టిన శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ పనులను చైర్మన్ కొండల్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ.. వ్యర్థాలను రోడ్లపై వేయకుండా చెత్త సేకరణ వాహనాల్లోనే వేయాలన్నారు. కాలనీల్లో ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని చెప్పారు. చౌదరిగూడలోని డాక్టర్స్ కాలనీ, కాకతీయనగర్, వేంకటేశ్వరనగర్, విజయసాయి ఎన్‌క్లేవ్, ఎంఎల్‌ఆర్ కాలనీల్లో పర్యటించి ప్రజలతో మాట్లాడారు. మాజీ ఉపసర్పంచ్ ఆకిటి బాల్‌రెడ్డి, ఎన్విరాన్మెంటల్ ఇంజినీర్ సాయితేజ, కాలనీవాసులు శ్రీనివాస్, రవీందర్, పనవ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవ వేడుకలు

అల్వాల్: బొల్లారం రిసాల బజార్ భజరంగ్‌కాలనీలోని శ్రీశీతల (పార్వతీదేవి సహిత శివ, నందీశ్వర, గణపతి, సుబ్రహ్మణ్య, ఆంజనేయ స్వామి) దేవాలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం నుంచి రుద్రహోమం, పూర్ణాహుతి, శ్రీశీతలదేవీ సమేత పరమేశ్వర కల్యాణం అనంతరం అన్నదానం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు కుసుగుండ్ల నాగమణి, కుసుమకుమార్‌రెడ్డి, దేవాలయ దాతలు, భజరంగ్‌నగర్ కాలనీవాసులు, భక్తులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఏకగ్రీవం

బోడుప్పల్: వాసవీనగర్ కాలనీ నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మోహన్‌బాబు, ఉపాధ్యక్షులుగా కిశోర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా క్రాంతికుమార్, కోశాధికారిగా సాయిగణేష్, కల్చరల్, ఆర్గనైజింగ్ మెంబర్స్‌గా సందీప్‌శర్మ, సంతోష్, లీగల్, మీడియా సలహాదారులుగా మల్లేష్, వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. నూతనకమిటీ సభ్యులు మాట్లాడుతూ.. మాజీ అధ్యక్షులు, కాలనీ పెద్దల సలహాలను తీసుకుంటూ.. సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. తమను ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు కాలనీవాసులకు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఘట్‌కేసర్: విద్యుత్‌లైన్ల మరమ్మతుల కారణంగా ఘట్‌కేసర్ 33/11కేవీ సబ్‌స్టేషన్ బాలాజీనగర్ 11 కేవీ ఫీడర్ పరిధిలో సోమవారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు బాలాజీనగర్, గాంధీనగర్, గీతామందిర్, టెలిఫోన్ ఎక్స్ఛేంజ్, ఈడబ్ల్యూఎస్‌నగర్, కేశవనగర్, గుంటిగూడెం, ద్వారకానగర్ కాలనీ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఘట్‌కేసర్ ఏఈ బలరాం ప్రకటించారు. విద్యుత్ వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

జవహర్‌నగర్: 11కేవీ మహంకాళి ఫీడర్ మరమ్మతులకారణంగా సోమవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ సాంబశివరావు తెలిపారు. సోమవారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4.30 వరకు శ్రీరామ్‌నగర్, మున్సిపల్ కార్యాలయం, జ్యోతికాలనీ, భజరంగ్‌నగర్, వీకే ఎన్‌క్లేవ్, సీపీఐ కాలనీ, లక్ష్మీనగర్, రిజిస్ట్రేషన్ కాలనీ, రావినారాయణరెడ్డి కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

శామీర్‌పేట్: శామీర్‌పేట సబ్ స్టేసన్ పరిధిలో నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని శామీర్‌పేట ఏఈ రాఘవేందర్‌రావు ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ దేవరయాంజాల్, 11 కేవీ తూంకుంట, 33/11 కేవీ ఫీడర్లలో మరమ్మతుల కారణంగా నేడు శామీర్‌పేట, పారిజాత హోమ్స్, ఓఆర్‌ఆర్ టోల్, మహిళా డిగ్రీ కళాశాల తదితర ప్రాంతాల్లో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఆయన వివరించారు.


బహుమతులు ప్రదానం చేస్తున్న సినీనటి అస్మిత, కళాశాల చైర్మన్

విద్యార్థి దశ విలువైనది

మేడ్చల్‌రూరల్: విద్యార్థి దశ ఎంతో విలువైందని, ఆ సమయాన్ని వృథా చేయకుండా కష్టపడి భవిష్యత్తును అందంగా మలచుకోవాలని సినీనటి అస్మితనాగరాజు, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఏడుకొండలు అన్నారు. గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని నర్సింహ్మారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో నూతనంగా చేరిన మొదటి సంవత్సరం విద్యార్థులను ఆహ్వానిస్తూ.. సీనియర్ విద్యార్థులు శనివారం సాయంత్రం 'ఫ్రెషర్స్ డే'ను ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న వారు మాట్లాడుతూ.. విద్యార్థి దశలోనే తమ లక్ష్యాలను ఏర్పరచుకుని వాటి సాకారానికి బాటలు వేసుకోవాలన్నారు. కళాశాల పూర్వ విద్యార్థి అయిన తాను నటిగా గుర్తింపు పొందడం గర్వంగా ఉందన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కళాశాల చైర్మన్ నర్సింహారెడ్డి, సెక్రటరీ త్రిశూల్‌రెడ్డి, డైరెక్టర్ మోహన్, ట్రెజరర్ త్రిలోక్‌రెడ్డి, ప్రిన్సిపాల్ లోకనాథం, వైస్ ప్రిన్సిపాల్ పురుషోత్తం ప్రసాద్, డీన్ వెంకట్రావు, సాక్ కన్వీనర్ శైలజరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సబ్బండ వర్గాల అభ్యున్నతికి అంబేడ్కర్ కృషి

ఘట్‌కేసర్: తన జీవితం, కుటుంబం అని ఆలోచించకుండా సబ్బండ వర్గాల కోసం డాక్టర్. బీఆర్.అంబేడ్కర్ జీవించారని రంగారెడ్డిజిల్లా కోర్టు న్యాయవాది పి. చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం అంబేడ్కర్ ఆలోచన విధానాలు ప్రజల్లోకి తీసుకెళ్లడానికి అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ప్రతిజ్ఞ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా తీర్చిదిద్దిన ఘనత అంబేడ్కర్‌కే దక్కిందని, దేశ ప్రజలందరూ సమానమేనని చాటిచెప్పారన్నారు. దాసు, నర్సింగ్‌రావు, రాందాసు, సత్యం, శ్రీనివాస్, రాజేష్‌కుమార్, ఎం. నర్సింగ్‌రావు, వెంకటేశ్వర్‌రావు, ఆనంద్, గణేశ్‌గౌడ్, నిఖిల్, విష్ణు, ప్రవీణ్, వివేక్, యాకేశ్ పాల్గొన్నారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన


ఉప్పల్ మినీ శిల్పారామంలో ప్రదర్శనతో కళాకారులు

ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో ఆదివారం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. గీతిక కూచిపూడి అకాడమీ నాట్యగురువు లక్ష్మీఅనంతకృష్ణ శిష్య బృందంచే నిర్వహించిన కూచిపూడి, జానపద నృత్యాలు అలరించాయి. మహాగణపతిమ్, చంద్రచూడా, ఆనంద తాండవం, గంధము పూయరుగా, అష్టపది, సరస్వతిస్తుతి అంశాలను కళాకారులు ప్రదర్శించి ఆకట్టుకున్నారు.

నృత్యశాలకు అవార్డు..

మల్కాజిగిరి: మల్కాజిగిరికి చెందిన అభినయ కూచిపూడి నృత్యశాలకు తెలుగు సంస్కృతి సాహితి సేవాట్రస్ట్ మహానది అవార్డు ప్రకటించింది. త్యాగరాజ గానసభలో జరిగిన కార్యక్రమంలో అవార్డును అందజేశారు. నృత్యశాల నిర్వాహకురాలు షెర్లీ మరియా పాల్‌ గిరి మాట్లాడుతూ.. ప్రాశ్చ్యాత దేశానికి చెందిన తాను భారతదేశ సంస్కృతి సాంప్రదాయాలను గౌరవిస్తానని, ఇక్కడే వివాహం చేసుకొని నృత్యపాఠశాల నిర్వహిస్తున్నానన్నారు. మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ శ్రవణ్ అభినందించారు.



19న వైద్యారోగ్య శాఖ అభ్యర్థులకు కౌన్సెలింగ్

డీఎంహెచ్‌ఓ డాక్టర్ రఘునాథ్‌స్వామి

సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో కాంట్రాక్ట్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులు ఈనెల19 న ఉదయం 10.30 గంటలకు మేడ్చల్ కలెక్టరేట్‌లోని వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో సర్టిఫికెట్ వెరిఫికేషన్, కౌన్సెలింగ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌ఓ డా. రఘునాథ్‌స్వామి ప్రకటించారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు, స్థానికతకు సంబంధించిన ధృవపత్రాలతో కౌన్సెలింగ్‌కు హాజరు కావాలన్నారు. ఫేక్ ఫోన్ కాల్స్ అని అనుమానం వస్తే 9440446106, టోల్ ఫ్రీ నంబర్ 1064 ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు.

22న దివ్యాంగులకు క్రీడా పోటీలు

జిల్లా సంక్షేమ శాఖ అధికారి స్వర్ణలత

సాక్షి,సిటీబ్యూరో: అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో జూనియర్ విభాగం (10 నుంచి 17 ఏళ్లు), సీనియర్ విభాగం (18 నుంచి 54 ఏళ్లు) వయస్సు ఉన్న దివ్యాంగులకు ఈనెల 22న నేరేడ్‌మెట్‌లోని రామకృష్ణపురం ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి స్వర్ణలత తెలిపారు. ఆసక్తి కలిగిన దివ్యాంగులు ఈనెల 21 ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు తమ పేరు నమోదు చేసుకోవచ్చన్నారు. ఆటల పోటీల్లో భాగంగా చెస్, ట్రైసైకిల్, రన్నింగ్, షాట్‌పుట్ క్రీడలు నిర్వహిస్తామన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

మైనారిటీలకు ఉచిత శిక్షణ

సాక్షి,సిటీబ్యూరో: మైనారిటీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మైనారిటీ స్టడీ సర్కిల్ ద్వారా ముస్లింలు, క్రిస్టియన్లు, సిక్కులు, బుద్ధులు, జైనులు, పార్శీయుల కోసం ఐఈఎల్‌టీఎస్, జీఆర్‌ఈ, టీఓఈఎఫ్‌ఎల్ పరీక్షలకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా మైనార్టీ అభివృద్ధి శాఖ అధికారి కె.వీణా తెలిపారు. హైదరాబాద్ గన్‌ఫౌండ్రీలో మైనార్టీ స్టడీ సర్కిల్ సెంటర్‌లో శిక్షణ ఇస్తారని తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఆధార్‌కార్డు, పాస్‌పోర్ట్ ఫోటో, విద్యార్హత సర్టిఫికేట్ జిరాక్స్ కాపీలు తీసుకుని ఈనెల 18 నుంచి 30 వరకు పేరు నమోదు చేసుకోవచ్చని ఆమె పేర్కొన్నారు. అదనపు వివరాల కోసం 040–23236112.

ఐక్యతతో హక్కులు సాధించుకోవాలి

కుషాయిగూడ: కాపులు తమ ఐక్యతను చాటి హక్కులు సాధించుకోవాలని జాతీయ మానవ హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ విజయభారతి అన్నారు. కాప్రా కాపుకులాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన కాపు రజతోత్సవ వనభోజన మహోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ సర్వోదయ మండల్ అధ్యక్షుడు నీలం రాంబాబునాయుడు, సుబ్బారావు, రామారావు, రాఘవేందర్‌రావు, కాప్రా కాపు కులాల ఐక్యవేదిక అధ్యక్షుడు జి.వి.ఎస్ రావు, ప్రధాన కార్యదర్శి నాగు, శ్రీనివాసరావు, శంకర్‌బాబు, సత్యనారాయణ పాల్గొన్నారు.

పార్కుల అభివృద్ధికి కృషి

బోడుప్పల్: ఆహ్లాదకరమైన వాతావరణం కోసం పార్కులను అభివృద్ధి చేస్తున్నట్లు బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్ అన్నారు. బోడుప్పల్ లక్ష్మీనగర్ కాలనీలోని హుడాపార్కును ఆదివారం ఆయన సందర్శించారు. పార్కులో వాకర్స్, చిన్న పిల్లలతో ముచ్చటించారు. అనంతరం కాలనీవాసులతో పార్కు సమస్యలపై చర్చించారు. ఆయన మాట్లాడుతూ.. పార్కుల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, దశలవారీగా అన్ని పార్కులను అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు. కొత్త కిశోర్‌గౌడ్, బొమ్మక్ శ్రీనివాస్, హరినాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.